కథా నిలయం
3540
శ్రీకాకుళం
NATIONS R. SIDENTS CULTURAL ASSOCIATION
2 BOMBAY POONA ROAD
SHIVAJINAGAR,
POONA

# పనిపిల్ల

నేనీ యింట్లో చేరి యివాల్టికి రెండు సంవత్సరాలయింది. ఈ యింట్లో నేను కసువు వూడుస్తున్నాను; అంట్లు తోముతున్నాను. తీరిక సమయాల్లో పిల్లల్ను ఎత్తుకుని ఆడిస్తున్నాను. నీళ్ళు కాయటం, మొదలైనవన్నీ నేనే చేస్తున్నాను. మా యజమానురాలు పనిమీద వుంటే కూరలు మొదలైనవన్నీ నేనే కోస్తూంటాను. నిజం చెప్పాలంటే యీ యింట్లో నేను చెయ్యని పనిఅంటూ లేదు.

నేను పని బాగా చెయ్యగలిగిందాన్నే. ఏదన్నా ఎక్కువ పనిచెప్పినా, "మొదట్లో ఈపని మనం అనుకోలేదు." అని అనేదాన్ని కాదు; అనుకునే దాన్నికూడా కాదు. మిగిలిన పనులు చేసినట్లే చేసేదాన్ని. నాకు ఈ పనులన్నీ చేసి, బట్టలు ఉతికినందుకు ప్రొద్దున అన్నంపెట్టి ఎనిమిది రూపాయలు యిచ్చేవాళ్ళు. సరిగ్గా నేను పనిలోకి ప్రొద్దున్నే ఏడు గంటలకల్లా వెళ్ళేదాన్ని. పనిపాటలు అన్నీ పూర్తియింతర్వాత పిల్లల్ని ఎత్తుకు తిప్పేదాన్ని. పదిగంటలకు అయ్యా భోజనంచేసి, ఆఫీసుకు వెళ్ళేవారు. పిల్లలందరూ అదేటైముకు భోజనాలు చేసుకుని స్కూళ్ళకు వెళ్ళేవాళ్ళు. ఇంక చంటి పిల్లలు యిద్దరు మిగిలేవాళ్ళు. అయ్యా వెళ్ళింతర్వాత నేనే చంటిపిల్లలను ఇద్దర్నీ పెట్టుకు కూచుంటే అమ్మ అప్పుడు స్నానంచేసి, ఉతికిన బట్టలు కట్టుకుని భోజనానికి కూర్చు

నేది. ఆమె భోజనం ముగించివచ్చి నన్ను అన్నం తినమనే వరకూ, రోజూ పదిగంట లయ్యేది. నాకు మొదట్లో కష్టం అనిపించేది కాదు. కాకపోతే తొమ్మిదిగంట లయ్యేం దగ్గర నుంచి ఆకలయ్యేది. అయితేనేం ? ఆకలి అవగానే ఏదో ఒకటి తినాలనిపించేది కాదు. ఆకలి అయితే అవుతుంది, అంతే. అది యెప్పుడూ అవుతూనే వుంటుంది. కాకపోతే కాళ్ళు ముడుచుకుని కూర్చుంటే సరిపోయేది.

నా కళ్ళముందు నాకు ఆకలి అయ్యేటప్పుడు వాళ్ళు చిరుతిండ్లు తింటున్నా, నాకు తినాలనిపించేది కాదు. కానీ కాలం గడిచినకొద్దీ నా బుద్ధి మారింది. వాళ్ళు చిరుతిండ్లు తిన్నప్పుడల్లా నాకూ తినబుద్ధి అయ్యేది. ఈ మార్పుకు కారణం ఏమిటో, ఎందుకొచ్చిందో ! నేను చెప్పలేను.

నేను ఈ ఇంట్లో పనిచేసుకుని నాయింటికి వెళ్ళేటప్పటికి, ఎప్పుడూ రాత్రి ఎనిమిది గంటలకు తక్కువ అయ్యేది కాదు. నేను వెళ్ళేటప్పటికి మా అమ్మ యింకా వచ్చేది కాదు. మా అమ్మ ఒక పెద్దయింట్లో పనిచేస్తూ వుండేది. రాత్రుళ్ళు వాళ్ళ అన్నాలు పూర్తి అయ్యేటప్పటికి ఏ పది గంటలో అయ్యేది. అప్పుడు వాళ్ళు తినగా మిగిలిన అన్నం పట్టుకుని మా అమ్మ వచ్చేది. ఈలోగా నేనే కుండలు కడిగి అన్నం వండేదాన్ని. గొడ్డుకారం వేసుకుని యింత తిని పడుకునేదాన్ని. ఒక్కొక్కప్పుడు నిద్ర ఆపుకోలేక, ఒచ్చిన దాన్ని వచ్చినట్లే పడి నిద్రపోయేదాన్ని. మా అమ్మ పని ముగించుకుని వచ్చి, అక్కడ మిగిలిన అన్నం ఏమన్నా

వుంటే నన్ను లేపి రెండుముద్దలు తినిపించేది; లేకపోతే లేదు. తనూ నా ప్రక్కనే చెంగు పరచుకుని పడుకుని నిద్రపోయేది.

తెల్లవారి ఐదు గంటలకు లేచి, నన్ను లేపి, తను పనిలోకి వెళ్ళేది. నేను ఇల్లు వూడ్చి, కుండలు కడిగి, ఏడు గంటలకల్లా నే పనిచేస్తున్న యింటికి వెళ్ళేదాన్ని. ఎప్పుడన్నా మా అమ్మ లేపినప్పుడు లేచి, మా అమ్మను బయటకు వెళ్ళనిచ్చి, మళ్ళా పడుకుని నిద్రపోయేదాన్ని. ఏ ఎనిమిది గంటలకో నిద్ర మెలుకువ వచ్చేది. గుండె గుభేలు మనేది. ఆదరాబాదరా పనిలోకి వెళ్ళేదాన్ని. ఇక నా యజమానురాలికి ఏం చెప్పి ఏం లాభం? "తెల్లవారి లేవగానే నరాలు ఒకే పెట్టున లాగినై, లేవలేకపోయాను" అని చెప్తే ఆమె వింటుందా? "నేను నిద్రపోయాను, ఎందుకుపోయానో నాకే తెలియదు" అంటే వూరుకుంటుందా? "ఈ పని అంతా ఎవరు చేస్తారనుకున్నావే, నీ తాత గాడు చేస్తా డనుకున్నావా?" అంటుంది. "ఇల్లు చూడు, ఎలావుందో – ఈ పిల్లల్ని ఎవరు చూస్తా రనుకున్నావ్ – నీ అబ్బ!" అంటుంది. "ఇల్లా అయితే కుదరదు. రేపటి నుంచీ రాకు. ఇంకొక పనిమనిషిని చూచుకుంటాం. మాకు పనిమనుష్యులే దొరకరనుకున్నావా? పనిమనుషులు దొరక్క నిన్ను పెట్టుకున్నాం అనుకున్నావా?" అని నానామాటలూ అంటుంది. నేను ఏమన్నా మాట్లాడకుండా వూరుకునేదాన్ని. తప్పు నాదే అనిపించేది. ఏడు గంటలకు వస్తానన్నాను, రాలేకపోయాను. ఎవర్నని ఏం ప్రయోజనం? ఏమన్నా తల వంచుకుని పనిచేసుకుపోయేదాన్ని. అదీ తప్పే అయ్యేది.

"బెల్లం కొట్టిన రాయల్లే పలుకవేమే !" అనేది యజమానురాలు. "దున్నపోతుమీద వాన పడ్డట్లే" అనేది. "ముంగి. అన్నీ కడుపులో పెట్టుకుని చెయ్యదలచింది చేసి పూరుకుంటుంది" అనేది. అననియ్ తప్పునాది. అనుకునేదాన్ని నేను. కానీ క్రమక్రమేణా నా బుద్ధి మారింది. ... మళ్ళీ ఎదురు తిరిగి మాటలు అనబుద్ధి అయ్యేది. ఈ మార్పుకు కారణం ఏమిటో, ఎందుకు వచ్చిందో నేను చెప్పలేను.

ఈ మార్పు వచ్చినప్పటినుంచీ అనేక ఆలోచనలు నాలో కదుల్లాడ మొదలు పెట్టినై. ఎక్కడ నుంచి వచ్చినయ్యో యీ ఆలోచనలు! అంతకు ముందు ఏమైనయ్యో! పొద్దున చేసిన చిరుతిండి అయ్యకు నాతోనే పంపేది. ఆ చిరుతిండి చూస్తే నాకు తినబుద్ధి అయ్యేది. మొదట్లో ఆ యింట్లో చేసుకున్న కూరలు నాకు రుచించేవి కాదు ! నా పచ్చడి మెతుకులే నాకు బాగుండేవి. అక్కడ అన్నం తిన్నా, ఇంటికి వెళ్ళి మళ్ళీ పచ్చడి మెతుకులు తిన బుద్ధి అయ్యేది. తినేదాన్ని కూడా. ఇప్పుడు కూరల రుచి తెలిసింది. తాళింపు వేస్తూంటే నో రూరుతుంది ఒకవేళ నాకు యివన్నీ వేసి పెడతానని, నేను పనిలో చేరినప్పుడు అనకపోయినా, నా యజమానురాలికి ఈ మాత్రం దయ ఎందుకు లేదా అనిపించేది.

నేను చిన్నదాన్ని. ఇన్ని రకరకాల వంటకాలు చూస్తూ, తినేవాళ్ళకు చేరవేస్తున్నాను కదా! నాకూ కూడా తినాలని వుంటుందని ఎందుకు అనుకోదో నా యజమానురాలు ! నాకు పెడితే ఏం పోయిందో ? పిల్లలకు పెట్టిన చిరుతిండ్లు వారు సరిగా తిననే తినరు. ఇటు కెలికి, అటు కెలికి పార

వేస్తారు. అదంతా ఎత్తి నేను పారవెయ్యాలి. ఆ ప్లేట్లన్నీ నేను కడగాలి. అప్పుడు నాకెట్లా వుంటుంది? మనస్సులో ద్వేషం పెరుగుతుందంటే ఎందుకు పెరగదు? పారవెయ్యనన్నా పారవెయ్యవచ్చుగానీ, నాకు పెట్టకూడదు. నాకూ తినాలని వుంటుందనీ, పారవేసేబదులు నాకు పెట్టవచ్చునీ నా యజమానురాలికి తట్టినట్లే కనపడదు. అసలు ఆమె నన్ను గురించి ఏమనుకుంటూ వుందో! నేను మనిషినని ఆమెకు తడుతున్నట్లే లేదు. నేను మనిషినే అని ఆమెను నమ్మించటం ఎట్లా!

నేనిట్లా కుళ్ళిపోతూంటే ఏ వంటిగంటకో పిలిచేది నా యజమానురాలు. "అన్నం తీసుకుని వెళ్ళి తినవే" అని. ఏమన్నం అది - వాళ్ళు రాత్రి తినగా మిగిలిన అన్నం! రాత్రి మిగిలిన ఏ పులుసో యింత వేసివుండేది! అంతకు ముందు యింట్లోవాళ్ళందరికీ, ఉప్మాలూ, ఇడ్డెన్లూ నేను చేరవేశాను. నేతితో వేయించిన యిగుర్లూ, పులుసులూ వడ్డించాను. వాళ్ళు విస్తళ్ళలో సగానికి సగం వదిలివేశారు. అవన్నీ ఎత్తేశాను. తీరా ఒంటిగంటవరకూ ఆకలి ఆపుకుని అన్నం తినాల్సివచ్చే వరకూ నిన్నరాత్రి వండినఅన్నం! అందరూ తినగా మిగిలిన అన్నం! నీళ్లు కారుతున్న అన్నం! ఆ అన్నం చూడగానే కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగేవి. పోనీ ఈ అన్నమే నేను రాగానే పెడితే, నా యజమానురాలికి పోయేది ఏముంది? వాళ్ళు ఒకసారి చిరుతిండి తిని, మళ్ళీ అన్నాలు ముగించుకుని అప్పుడా ఈ అన్నం నాకు పెట్టేది? ముందుగానే పెడితే, ఆవిడకు పోయేది ఏముంది? కానీ

పెట్టదు...ఒక వేళ వాళ్ళు ముందుగా భోజనాలు ముగించు కున్నా, నే నీ అన్నంకోసం ఒంటిగంటదాకా ఉండవలసిందే. అంతగా కాలం గడవకపోతే ఆవిడ ఒక్క గుక్కెడు నిద్ర పోయి వస్తుంది. ఎందుకిట్లా చెయ్యటం?

నేను వుండబట్టలేక, ఒకరోజు నా యజమానురాలిని అడిగాను: 'ఆకలి అవుతూవుంది. ముందుగా అన్నం పెట్ట' మని: ఈమాటకు ఆమె ఇంతఎత్తున లేచి, "ఎంతపొగరే నీకు? మేము తినకముందు నీకు పెట్టాలా? ఇంట్లో తిని బలిసి, ఒంటికి కావరం పట్టిందే నీకు! ఇక నిన్ను ఒక్క క్షణం వుంచుకోను. పో యిక్కడనుంచి" అని ఇంట్లోంచి తరిమి వేసింది.

నేను కాళ్ళీడ్చుకుంటూ నాగుడిసెకు వెళ్ళాను. ఎక్కడనించి వచ్చిందో నిద్దుర. నేలమీదపడి మొద్దు నిద్దుర పోయాను. రాత్రి ఎప్పుడో మా అమ్మవచ్చి లేపింది. నేను జరిగిందంతా చెప్పాను. మా అమ్మకు ఎక్కడలేనికోపం వచ్చింది. "ఓసి నీ తాడు తెగ! వాళ్ళు ఎప్పుడు పెడితే అప్పుడు తినక నీ కేం రోగం వచ్చిందే! వాళ్ళతో పాటు పెట్ట మంటావటే నీకు? నా రెక్కల కష్టం నాకే సరిపోవటం లేదు. ఇక నిన్నెక్కడ పోషించేదే నేను? చావు... చావు" అని చితకగొట్టింది. కొట్టి కొట్టి తనూ ఆవురన్న ఏడ్చింది. ...నన్ను కావు లించుకుని..."దేవు డెందుకు తీసుకుపోడే మన బోటివాళ్ళని" అని గుండె పగిలేట్టు ఏడిచింది.